# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 19-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- దేశాభివృద్ధిలో మహిళలు మరింత క్రియాశీలక పాత్ర పోషించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆకాక్షించారు.
- తమిళనాడులోని బాణసంచా తయారీ కేంద్రంలో ఈరోజు జరిగిన పేలుడులో 21 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.
- ప్రస్తుత ఎన్నికల వేళ సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.
- రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల్లో రేపు తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశాభివృద్ధిలో మహిళలు మరింత క్రియాశీలక పాత్ర పోషించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆకాక్షించారు. పశ్చిమ బెంగాల్‌లోని బాంకురా జిల్లా బిష్ణుపుర్‌లో ఈరోజు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ప్రాధాన్యతనిచ్చే రిజర్వేషన్ బిల్లును అడ్డుకునేందుకు టీఎంసీ, కాంగ్రెస్‌లు చేతులు కలిపాయని ఆరోపించారు. మహిళా సాధికారతకు భాజపా మారుపేరని, మహిళల భద్రత, సురక్షిత జీవనానికి కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. చట్టాలను ఉల్లంఘించి చొరబాటుదారులకు లాభం చేకూర్చడం, మత ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం వంటి చర్యలతో తృణమూల్ మహిళా సాధికారతకు వ్యతిరేకంగా ఉందని ఆయన పేర్కొన్నారు. తమను గెలిపిస్తే పశ్చిమ బెంగాల్ ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని పేర్కొంటూ...

(వాయిస్...25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

తమిళనాడులోని విరుదునగర్ జిల్లా వి.ముత్తులింగాపురంలో ఒక బాణసంచా తయారీ కేంద్రంలో ఈరోజు సంభవించిన పేలుడులో 21 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. మధ్యాహ్న సమయంలో కార్మికులు ఫ్యాక్టరీ లోపల ప్రమాదకరమైన రసాయనాలను తరలిస్తున్న సమయంలో పేలుడు సంభవించినట్లు అధికారులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఆరుగురు క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

తమిళనాడులో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమం వేదికగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్పందిస్తూ.. ఘటనలో ప్రాణనష్టం జరగడం అత్యంత బాధాకరమని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

రెండు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే తో కొలంబోలోని అధ్యక్ష భవనంలో ఈరోజు భేటీ అయ్యారు. భారత ప్రభుత్వం అనుసరిస్తున్న 'పొరుగు దేశానికే ప్రథమ ప్రాధాన్యం' విధానాన్ని ఈ భేటీలో ఉపరాష్ట్రపతి పునరుద్ఘాటించారు. ఇరు దేశాల ఉమ్మడి ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సహకారాన్ని పటిష్టం చేసేందుకు భారత్ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. గృహ నిర్మాణ పథకం పురోగతిపై, 'దిత్వా' తుపాను ధాటికి దెబ్బతిన్న ప్రాంతాల పునరుద్ధరణ కోసం భారత్ ప్రకటించిన 450 మిలియన్ డాలర్ల ప్యాకేజీ కింద అమలవుతున్న ప్రాజెక్టుల గురించి చర్చించారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రస్తుత ఎన్నికల వేళ సామాజిక మాధ్యమాలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను బాధ్యతాయుతంగా వినియోగించాలని కేంద్ర ఎన్నికల సంఘం (ECI) మరోసారి స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేలా కృత్రిమ మేధ ద్వారా సృష్టించిన, తప్పుదోవ పట్టించే అంశాలు లేదా చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను గుర్తించిన మూడు గంటల్లోపు చర్యలు తీసుకోవాలని ఈసీ ఆదేశించింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటివరకు నిబంధనలు ఉల్లంఘించిన సుమారు 11 వేలకు పైగా సోషల్ మీడియా పోస్టులు, యూఆర్ఎల్ (URL)లను గుర్తించి, వాటిపై చర్యలు తీసుకున్నట్లు కమిషన్ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా రహదారి భద్రతను మెరుగుపరచేందుకు సుప్రీంకోర్టు పలు మార్గదర్శకాలను జారీ చేసింది. పరిపాలనా లోపాలు, మౌలిక వసతుల లోటు కారణంగా ఎక్స్‌ప్రెస్‌వేలు ప్రమాద మార్గాలుగా మారకూడదని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ జె.కె. మహేశ్వరి, జస్టిస్ ఎ.ఎస్. చందూర్కర్లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. దేశంలోని మొత్తం రోడ్డు నెట్‌వర్క్‌లో జాతీయ రహదారుల వాటా కేవలం 2 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, రోడ్డు ప్రమాద మరణాల్లో మాత్రం వీటి వాటా 30 శాతంగా ఉండటంపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. నివారించదగ్గ ప్రమాదాల వల్ల ఒక్క ప్రాణం పోయినా.. అది ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యమే అవుతుందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లో ఒడిశా సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. భువనేశ్వర్‌లోని ఇన్ఫో వ్యాలీలో '3డీ గ్లాస్ సొల్యూషన్స్' సంస్థ నిర్మించనున్న దేశంలోనే మొట్టమొదటి అధునాతన '3డీ గ్లాస్ సబ్‌స్ట్రేట్ ప్యాకేజింగ్' పరిశ్రమకు ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సెమీకండక్టర్ రంగంలో, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ విభాగాల్లో ఈ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొంటూ...

(వాయిస్…17 సెకన్లు)

అనంతరం అశ్వినీ వైష్ణవ్ భువనేశ్వర్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. దేశవ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = =

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ నెల 21 నుండి మూడు రోజుల పాటు జర్మనీలో పర్యటించనున్నారు. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ పర్యటన లక్ష్యమని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. పర్యటనలో భాగంగా జర్మనీ రక్షణ మంత్రి బోరిస్ పిస్టోరియస్‌తో రాజ్‌నాథ్ భేటీ కానున్నారు. ముఖ్యంగా సైబర్ భద్రత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), డ్రోన్ల తయారీ వంటి రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ మూడు రోజుల పర్యటన నిమిత్తం ఈరోజు దిల్లీకి చేరుకున్నారు. దక్షిణ కొరియా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత లీ జే మ్యుంగ్ భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. పర్యటనలో భాగంగా రేపు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ఆయన భేటీ కానున్నారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేయడంపై చర్చలు జరపనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద దేశవ్యాప్తంగా 2 వేల 500 మందికి పైగా లబ్ధిదారులకు కృత్రిమ మేధస్సు (AI) సాధనాల వినియోగంపై శిక్షణ ఇచ్చినట్లు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సాంప్రదాయ హస్తకళాకారులు, వృత్తిపనివారల జీవనోపాధిని మెరుగుపరచడంతో పాటు, వారి వ్యాపార సామర్థ్యాన్ని పెంచడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సంప్రదాయ కళలకు ఏఐని జోడించడం ద్వారా డిజిటల్ వ్యత్యాసాలను తొలగించవచ్చని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = =

చండీఘర్ లోని ముల్లాన్ పూర్ స్టేడియం వేదికగా లక్నో సూపర్ జియంట్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన లక్నో జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన పంజాబ్ జట్టు 11 ఓవర్లు పూర్తయ్యేసరికి 1 వికెట్ కోల్పోయి 129 పరుగులు చేసింది.
అంతకుముందు.. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ స్టేడియం వేదికగా.. రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ జట్టుపై కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = =

తూర్పు రాజస్థాన్, తూర్పు ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల్లో రేపు తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం సహా కోస్తా కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కరైకల్ ప్రాంతాల్లో రానున్న రెండు రోజుల పాటు ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోత ఎక్కువగా ఉంటుందని తెలిపింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో రేపు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఉత్తర కర్ణాటకలో రానున్న రెండు రోజుల పాటు ఉరుములతో కూడిన వడగండ్ల వాన కురిసే వీలుందని అంచనా వేసింది. కేరళ, మాహే, కొంకణ్, విదర్భ ప్రాంతాల్లోనూ ఇదే తరహా వాతావరణం నెలకొంటుందని పేర్కొంది. ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయల్లో ఈ నెల 22 వరకు భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =